# ప్లానింగ్

ఆ రోజు ఆగస్టు 31వ తేదీ. సౌజన్యరావు రిటైర్‌మెంట్ రోజు. సాయంకాలం ఆఫీసులో పార్టీ ఇచ్చారు. పూలదండలు వేసారు. ఒక జ్ఞాపికను బహూకరించారు. చాలా మంది పొగుడుతూ మాట్లాడారు. అతను వాటికి అర్హుడే. ఆఫీసులోనే కాదు, ఇంట్లోనే కాదు, ఎక్కడైనా ఒక పద్ధతి ప్రకారం నడుచుకునే మనిషతను. ఇంటిదాకా వచ్చిన అతని ఆఫీసు వాళ్ళు కాసేపు కూర్చుని, తిరిగి కారులో వెళ్ళిపోయారు.

ఇంట్లో ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు అందరూ, అతని సుఖమయ జీవితానికి శుభాకాంక్షలు చెప్పారు. రాత్రి పడుకునే ముందు సౌజన్యారావు భార్య చెప్పింది. 'మనవల పేరున ఒక్కొక్కరికి పదివేలు వేయమని, కూతురికి ఏభైవేలు ఇవ్వమని, కోడళ్ళిద్దరికీ రెండేసీ జతల గాజులు చేయించమని'.

మనసులోనే లెక్కవేసుకున్నాడు. వీటికెంతవుతుందో! ఎనభై వేలదాకా అయ్యేట్టుంది. కూతురు పెళ్ళికి చేసిన అప్పు, ఇంకా డెబ్బై అయిదువేలు వుంటుంది. తనకి వచ్చిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అంతా కలిపి అయిదు లక్షలు. ఇంకా కనీసం రెండు రూముల ఫ్లాట్ దూరంలోనైనా కొనమంటున్నారు. ఇవన్నీ ఎలాచేయాలో అర్థం కావడం లేదతనికి.

"సరే చూద్దాం. పడుకో" అన్నాడు భార్యతో.

పొద్దునే పెద్దకొడుకు, సౌజన్యరావుతో అన్నాడు "నాన్నగారూ! నేను కాలేజీలో చదువుకునే రోజుల్నుంచీ మిమ్మల్ని అడుగుతున్నాను, ఒక స్కూటర్ కొనివ్వమని. మీకు వీలైతే ఆ కోరిక తీర్చండి" అన్నాడు.

కొడుకులు ఆఫీసుకెళ్లిన తరువాత సౌజన్యారావు, భార్యతో అన్నాడు, 'పెద్దాడు స్కూటర్ కొనివ్వమని అడిగాడు. నువ్వు కొన్ని చెప్పావు. మరి ఇవన్నీ చేస్తే ఒక సొంత ఇల్లు కొనడం ఎలా?'

తల్లి మనసు! పాపం పిల్లలడిగింది వద్దని ఎలా చెబుతుందావిడ.

"పెద్దాడు ఎప్పట్నుంచో ముచ్చటపడుతున్నాడు, స్కూటర్ గురించి. కోడలికి కూడా స్కూటర్ మీద భర్తతో వెళ్ళడమంటే సరదా అనుకుంటాను. పోన్లెండి. పిల్లల సరదాలు మనం కాకపోతే ఎవరు తీరుస్తారు. వాడి ముచ్చట తీర్చండి" అందావిడ.

"అది సరే. పెద్దాడికి ఇస్తే, చిన్నాడు ఏమనుకుంటాడో! వాడి ఉద్దేశ్యం ఏమిటో మెల్లగా కనుక్కో" అన్నాడు, సౌజన్యారావు.

సాయంకాలం ఆఫీసు నుంచి వచ్చిన చిన్న కొడుకుని పిలిచి స్కూటర్ ప్రస్తావన చేసింది తల్లి.

రెండో కోడలు పెద్ద పనున్నట్లు వచ్చి "రాత్రి మీరూ, మామయ్యగారు భోజనం చేస్తారా, లేకపోతే చపాతీలు చేయనా?" అని అడిగింది.

"ఏదో ఒకటి చేయి, రాత్రి భోజనం చేయం" అని చెప్పి కోడల్ని పంపేసింది.

"నాకు కూడా స్కూటర్ కావాలమ్మా. ఈ బస్సుల్లో వెళ్లాలంటే చాలా కష్టంగా వుంది. పైగా మా ఆఫీసర్ కొత్తగావచ్చాడు . చాలా స్ట్రిక్ట్" అన్నాడు.

పైగా, తను చెల్లెలు పెళ్ళికి పాతికవేలు ఫ్రెండ్ దగ్గర తెచ్చి ఇచ్చాననీ, అందులో కనీసం పదిహేను వేలైనా తీర్చేయాలని చెప్పాడు.

భార్య ఈ విషయాలన్నీ సౌజన్యారావుతో చెప్పింది. బాగానే వుందనుకున్నాడు. ఏదో ఒకటి జరుగుతుంది భగవంతుడే వున్నాడు, కానీ.... అని రెండు స్కూటర్లు కొనివ్వడానికే నిర్ణయించుకున్నాడు. రిటైర్‌మెంట్‌కి వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చి అప్పులవాళ్ళ చేత 'శభాష్' అనిపించుకున్నాడు. కొడుకులు, కోడళ్ళ సరదాలు తీర్చి వాళ్లచేత 'భేష్' అనిపించుకున్నాడు. కూతురికి ఏభైవేలిచ్చి అల్లుడిచేత 'భళారే మామా' అనిపించుకున్నాడు, సౌజన్యారావు. ఇంక, రెండున్నర లక్షలు మిగిలాయి. సౌజన్యారావు గుండె గుభిల్లుమంది.

పదిహేను రోజుల తరువాత, ఆ ఫ్లాట్ విషయం ఏం చేసారని కొడుకులు అడిగారు. ప్లాటూ లేదు, ఫ్లాటూ లేదు అని గట్టిగా చెబుదామనుకున్నాడు. కాని పిల్లలు బాధపడతారని అనలేదు.

చిన్నకోడలు పెద్దకోడలితో అంది, "అక్కయ్యా! అప్పుడే కార్తీకమాసం వచ్చేసింది. ఈ కార్తీక దీపాలుండగానే మన ఇళ్ళు చక్కబెట్టుకోవాలి".

"ఇళ్ళు అంటున్నావు. మనకి ఉండేది ఈ అద్దె ఇల్లు ఒక్కటే కదా" అంది పెద్దకోడలు.

"అంటే ఎప్పుడూ ఆ ముసలాళ్లతోనే వుంటావా నువ్వు? నీకు తెలుసో

తెలియదో, మామయ్యగారి దగ్గరున్నది అక్షరాలా రెండున్నర లక్షలు మాత్రమే" అంది చిన్నకోడలు.

"అందుకే మా అమ్మ, మొన్న నేను పుట్టింకి వెళ్ళినప్పుడు చెప్పింది "అమ్మాయ్! నీకేం తెలీదు. కనీసం నీ తోడికోడలు మాటవిను, బాగుపడతావు".

పొంగిపోతూ అంది చిన్నకోడలు, "ఈ కార్తీక మాసంలో మామగారు, అత్తగారు కూడా సోమవారం ఉపవాసాలు ఉంటారు. తెల్లారకట్ల గుడికి కూడా వెళ్తారు. మనం కూడా వాళ్లతో శివాలయానికి వెళ్ళి, ఆ గుళ్లో, వాళ్లతోపాటు ప్రదక్షిణాలు చేసి, ఆఖరి సోమవారం వాళ్లు నీరసంగా వున్నప్పుడు కనీసం ఒక్కొక్కళ్ళు డెబ్బై అయిదువేల దాకా పట్టేద్దాం" అంది చిన్నకోడలు.

అనుకున్నట్లుగానే కోడళ్ళు, కొడుకుల మద్దతుతో ఒక లక్షా ఏభైవేలదాకా పట్టేసారు. ఇంక ఒక లక్ష మాత్రమే మిగిలింది. ధనుర్మాసం వచ్చేసింది. ఇంక మిగిలిన డబ్బు గుర్తొచినప్పుడల్లా సౌజన్యారావు గుండె ధన్‌మని కొట్టుకుంటోంది.

"మనకి ఏమైనా అనారోగ్యం చేస్తే మన దగ్గర తగినంత డబ్బు కూడా లేదు. మళ్ళీ ఏదైనా ఉద్యోగం చేయమంటావా?" అని పిల్లలకి వినబడేటట్లు, భార్యతో అన్నాడు, సౌజన్యారావు వాళ్ళేమంటారో చూద్దామని.

"ఇంకా ఉద్యోగమేం చేస్తారు. మగపిల్లలు మనల్ని చూస్తారులెండి. మనం ఎప్పుడూ వాళ్లకి ఏలోటూ చేయలేదుకదా. కోడళ్ళు కూడా మీరు రిటైర్ అయిన తరువాత ఇంకా జాగ్రత్తగా చూస్తున్నారు" అంది సౌజన్యారావు భార్య.

ఒకసారి చిన్నకోడలు మామగారితో అంది "మామయ్యగారూ! మీరేమి అనుకోనంటే ఒక చిన్నకోరిక".

"ఏమిటమ్మాచెప్పు" అన్నాడు సౌజన్యారావు. "మా చెల్లెలి పెళ్ళి కట్నం లక్షా డెబ్భైవేలు. పైన ఒకలక్ష పెళ్ళి ఖర్చు అవుతుందనుకుంటాను. ఒక పాతికవేలు మీరు సర్దగలరేమోనని అడగమన్నారు మా నాన్నగారు" అంది.

సహజంగా సహాయపడే గుణమున్న సౌజన్యరావుకి పెళ్లి అంటే ఎంత కష్టమో కూడా తెలుసు. అందుకే "ఒక నోటు నీ పేరున తీసుకుని ఇద్దాం, ఆడపిల్ల సొమ్ము పుట్టింటివాళ్ళు ఎప్పటికైనా ఇచ్చేస్తార్లే" అన్నాడు సౌజన్యరావు.

"అలాగే కానీండి" అంటూ ఒక పాతికవేలు పట్టేసింది చిన్నకోడలు.

తరువాత ఆర్నెల్లకి, పెద్దబ్బాయి, తన కొడుకుని మంచి కాన్వెంట్‌లో వేయడానికి ఇరవై వేలు ఇమ్మని అడిగాడు. వాడు మొదటి మనవడు. కాదని ఎలా అనగలడు? ఆ డబ్బు కూడా సర్దుబాటు చేశాడు సౌజన్యరావు. ఇంక బ్యాంక్ బ్యాలెన్స్ ఏభై అయిదువేలే వుంది. ఎప్పటికప్పుడు బ్యాలెన్స్‌షీట్ తయారుచేస్తూనే వున్నారు, ఇంట్లో వాళ్ళు. చిన్న కోడలు సలహా మేరకు, తన రెండో కొడుకు, ఇంకో రాష్ట్రానికి బదిలీ చేయించుకుని వెళ్ళిపోయాడు. వెంటనే బదిలీ చేయించుకుని వెళ్ళిపోతే బాగుండదని, కొంతకాలం తరువాత, పెద్దవాడు కూడా ఇంకో రాష్ట్రానికి బదిలీ చేయించుకున్నాడు.

ఆఖరికి ఇద్దరు ముసలాళ్ళూ, ఆకాస్త బ్యాంక్ బ్యాలెన్స్‌తో, ఆ ఊళ్ళో మిగిలారు. ఒకరోజు సౌజన్యరావు భార్య అంది "పిల్లలు మన దగ్గర లేకుండా వెళ్ళిపోయారు. మళ్లీ మనమిద్దరమే మిగిలాం".

"రెక్కలు వచ్చిన పక్షులు గూట్లోంచి ఎగిరిపోతాయి. అందులోనూ అవి జంట పక్షులు కూడాను. ఇటువంటి పరిస్థితులు వచ్చిన తరువాత నువ్వేమైనా ఇబ్బంది పడతావేమోనని అని, కొంత డబ్బు, ఆఫీసులో జీతం బకాయిలు వచ్చినప్పుడు ఎవరికీ తెలియకుండా జాగ్రత్తచేసాను. పిల్ల పెళ్ళికి అవసరమైనా, ఆ డబ్బు తీయలేదు. విడిగా అప్పుచేసాను. రెండునెలల్లో నాలుగు లక్షల దాకా మొత్తం డిపాజిట్, చేతికి అందుతుంది. ఆడబ్బు నీ పేరున వేస్తాను. నెలనెలా వడ్డీ వస్తుంది. ప్రపంచంలో ఎంతోమంది ముసలివాళ్లను చూస్తున్నాం! పిల్లలుండి కూడా, ఆసరాలేకుండా బ్రతుకుతున్నారు. ఇప్పుడర్థమయిందా నువ్వు చెప్పినట్టే ఆ డబ్బు ఎందుకు ఖర్చు పెట్టేశానో" అన్నాడు సౌజన్యరావు.

కళ్ళల్లో నీళ్ళు తిరిగిన సౌజన్యరావు భార్య, అతన్ని స్పష్టంగా చూడలేక, తన మనస్సులోనే చూసుకుంటూ దండం పెట్టుకుంది, పతిభక్తితో.

(ఆంధ్రభూమి సచిత్రమాసపత్రిక, అక్టోబర్ 2004)